బైబిలు యొక్క గొప్ప బోధలు

# క్రీస్తు యొక్క రూపాంతరం

మత్తయి 17:1–8లో ఒక అసాధారణమైన సంఘటన దాఖలు చేయబడింది:

> ఆరు దినములైన తరువాత యేసు పేతురును యాకోబును అతని సహోదరుడైన యోహానును వెంటబెట్టుకొని యెత్తయిన యొక కొండమీదికి ఏకాంతముగా పోయి వారి యెదుట రూపాంతరము పొందెను. ఆయన ముఖము సూర్యునివలె ప్రకాశించెను; ఆయన వస్త్రములు వెలుగువలె తెల్లనివాయెను. ఇదిగో మోషేయు ఏలీయాయు వారికి కనబడి ఆయనతో మాటలాడుచుండిరి. అప్పుడు – "ప్రభువా, మన మిక్కడ ఉండుట మంచిది; నీ కిష్టమైతే ఇక్కడ నీకు ఒకటియు మోషేకు ఒకటియు ఏలీయాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదుమని యేసుతో చెప్పెను." అతడు ఇంకను మాటలాడు చుండగా ఇదిగో ప్రకాశమానమైన యొక మేఘము వారిని కమ్ముకొనెను; "ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను; ఈయన మాట వినుడని" యొక శబ్దము ఆ మేఘములోనుండి పుట్టెను. శిష్యులు ఈ మాటవిని బోర్లపడి మిక్కిలి భయపడగా యేసు వారియొద్దకు వచ్చి వారిని ముట్టి–"లెండి, భయపడకుడని" చెప్పెను వారు కన్నులెత్తి చూడగా, యేసు తప్ప మరి ఎవరును వారికి కనబడలేదు.[1]

పవిత్ర చరిత్రయంతటిలో రూపాంతరపు దృశ్యము మిక్కిలి గంభీరమైనదైయుంది. తన సంఘమును కట్టుదునని ప్రభువు వాగ్దానం చేసిన వారానికి యిది సంభవించింది (మత్తయి 16:18). ఫిలిప్పుదైన కైసరయకును యెరూషలేమునకును మధ్యనున్న దారి ప్రక్కనున్న కొండమీద ఈ దృశ్యం సంభవించియుండవచ్చు. ప్రభువైన యేసు ముగ్గురు సాక్షులను తనతో తీసికొని పోయాడు: వారు పేతురు, యాకోబు, యోహానులు. తక్కిన సందర్భాలలో వీరు ముగ్గురే ఉన్నారు.[2] యేసు మనస్సులో ఉన్న ఉద్దేశాలకు మనస్సులోను హృదయంలోను శ్రేష్ఠంగా సిద్ధపడిన అపొస్తలులు అప్పటిలో వారే కావచ్చు. "సంఘములో స్తంభములుగా ఎంచబడినవారని" తరువాత పౌలు వీరిని సూచించాడు (గలతీ. 2:9). వారిని ఎన్నుకోడంలో కారణమేమైయున్నా, ఈ సందర్భంలో ప్రార్థించుటకు ప్రభువుతో పాటు కొండమీదికి వెళ్లినవారు వీరే.

## యేసు రూపాంతరం పొందాడు

యేసు ప్రార్థించుచుండగా, ఆయన రూపము మారిపోయింది. ఆయన మహిమ

రూపంలో కన్పించాడు. తన భూనివాస కాలానికి ముందు ఆయన ధరించియున్న రూపమును గూర్చిన మర్మమును యిది కొంతవరకు తెలుపుతోంది, ఆయన మహిమపరచ బడిన తరువాత ఉండబోయే వైభవాన్ని సహా అది సూచిస్తుంది. పరలోకపు వాసులకు అత్యధికమైన మహిమ రూపాలుంటాయి. దేవునితో కొంతకాలం (సీనాయి కొండపై గడిపివచ్చిన తరువాత) మోషే ముఖం ప్రకాశించింది (నిర్గమ. 34:29). ప్రభువైన యేసు తార్సువాడైన సౌలునకు ప్రత్యక్షమైనప్పుడు, "సూర్య తేజస్సుకు మించిన" వెలుగులో ఉన్నాడు (అపొ. 26:13). పత్మాసుద్వీపంలో ప్రభువు యొక్క ప్రత్యక్షతను యోహాను తిలకించింది నిజంగా ఆలోచించడానికే సుప్రసిద్ధమైనదిగా ఉంది (ప్రకటన 1). రూపాంతరంలో, యేసు ముఖము సూర్యునివలె ప్రకాశించింది, ఆయన వస్త్రములు చాలా తెల్లనివయ్యాయి. అది ఆశ్చర్యమైన దృశ్యమైయుండాలి.

## మోషే ఏలీయాలు కన్పించారు

పేతురు, యాకోబు, యోహానులు యేసును వీక్షించుచుండగా, "ఇద్దరు పురుషులు ఆయనతో మాటలాడుచుండిరి" (లూకా 9:30). మోషే, ఏలీయాలు విడిచి వెళ్లిన తీరులో ఏదో యొక మర్మము జతచేయబడినట్టు అనిపిస్తుంది. మోషే వాగ్దాన భూమి యొక్క పొలిమేరలో మృతినొందాడు, ఏ మానవ హస్తమువలన సమాధి చేయబడలేదు. వాస్తవంగా, మోషే దేహాన్ని గూర్చి అపవాదికిని, ప్రధాన దూతయగు మిఖాయేలుకును వివాదం జరిగినట్టు ఆశ్చర్యంగొలిపేలా యూదా 9 సూచిస్తుంది. యూదా దీన్ని పూర్తిగా వివరించలేదు, పైగా అది యింకా ఎక్కడను ప్రస్తావించబడలేదు. మోషే కడపటి విశ్రమ స్థానం గుర్తు చూపబడలేదు (ద్వితీయో. 34:6).

ఏలీయా క్రీస్తు పూర్వం రమారమి వెయ్యి సంవత్సరాల క్రిందట జీవించాడు. పాత నిబంధనలో మరణం రుచి చూడకయే కొనిపోబడిన[3] యిద్దరిలో యితడొకడు. నిర్ణయింప బడిన సమయంలో, అగ్ని రథములు అని వర్ణించబడినవి పరలోకంనుండి అక్కడికి వచ్చాయి; ఏలీయా ఈ లోకంనుండి కొనిపోబడ్డాడు (2 రాజులు 2:11).

మోషే మృతి పొందిన పదిహేనువందల సంవత్సరాలకు, ఏలీయా కొనిపోబడిన వెయ్యి సంవత్సరాలకు, రూపాంతర సమయాన, వారు ఆ కొండమీద యేసుతో మాటలాడుతున్నట్టు కన్పించారు. శాశ్వతత్వమును యిది రుజువు చేస్తుంది (చావు చావకపో!) చనిపోయినవారైనా చనిపోనివారైనా. వారు యింకను సజీవులుగానే ఉన్నారు! మనిషిలో ఉన్న ఏదో యొకటి ఉనికిని వీడదు.

ఈ లోకాన్ని విడిచిన శతాబ్దాల తరువాత ఆ యిద్దరు మనుష్యులు క్రీస్తుతో మాటలాడారు. మాట్లాడుతుంది దేన్ని గురించి? దాన్ని మనం ఊహించనవసరం లేదు. సమీపిస్తున్న క్రీస్తు ప్రభువు యొక్క మరణాన్ని గూర్చి (లూకా 9:31), మానవ దృష్టి కేంద్రీకరించిన ప్రధానమైన అంశాన్ని గూర్చి, ఎన్నో తరాలకు ముందున్న వ్యక్తులకు శ్రద్ధ ఎందుకు? హెబ్రీ. 9:15లో జవాబు ఉంది: పాపములను క్షమించడానికి ఆయన రక్తము వెనుకకు, ముందుకు ప్రవహిస్తుంది.

## పరలోకంనుండి ఒక శబ్దం వచ్చింది

మొదట్లో, ఆ ముగ్గురు అపొస్తలులను నిద్ర వశపరచుకొంది (లూకా 9:32); అయితే వెంటనే వారు మేల్కొల్పబడ్డారు, వారి ఆసక్తి త్వరలోనే రేకెత్తించబడింది. "... నీ కిష్టమైతే ఇక్కడ నీకు ఒకటియు, మోషేకు ఒకటియు, ఏలీయాకు ఒకటియు మూడు పర్ణశాలలు కట్టుదునని" పేతురు ఉత్సాహపూరితుడై పలికాడు (మత్తయి 17:4). వారు ముగ్గురిని సమానంగా గౌరవించాలని అతడు కోరినట్టున్నాడు. ప్రభువు అతన్ని గద్దించ లేదు; మనస్సులో నాటుకునేలా అది చేయబడవలసియుంది. ప్రకాశమానమైన మేఘము వారిని కమ్ముకొంది, మరియు దేవుని స్వరం వినబడుతుంది: "ఈయన నా ప్రియ కుమారుడు ... ఈయన మాట వినుడి"! (మత్తయి 17:5). తన జీవిత కాలమంతటిలో పేతురు దీన్ని గుర్తుంచుకున్నాడు. దాదాపు ఒక తరం గతించిన తరువాత దీన్ని అతడు సూచించాడు (2 పేతురు 1:16-18).

దీని భావమేమి? పాత నిబంధన యుగమంతటికి మోషే ఏలీయాలు నిలిచి యున్నారు. మోషే ధర్మశాస్త్రానికి ప్రాతినిధ్యం యిచ్చాడు, ఏలీయా ప్రవక్తలకు ప్రాతినిధ్య మిచ్చాడు. ప్రభువైన యేసే, "ఇది ధర్మశాస్త్రమును, ప్రవక్తలును" అనే సంగ్రహ ప్రయోగం చేశాడు (మత్తయి 7:12). మోషేయు ప్రవక్తలును అధికార పూర్వకంగా చెలామణియైన కాలముంది. రూపాంతరం తరువాత, క్రీస్తు మాట వినాలని అపొస్తలులకు చెప్పారు. దేవుడు ప్రవక్తలద్వారా మాట్లాడింది వాస్తవం, అయితే ఈ దినాలలో ఆయన కుమారుని ద్వారా మనతో మాట్లాడుతున్నాడు (హెబ్రీ. 1:1, 2).

పాత నిబంధన ప్రక్కన పెట్టబడిందని రూపాంతరాన్ని గురించిన సంఘటనలు బలంగా బోధిస్తున్నాయి. ఆ పాఠం పేతురుకు అవసరమయ్యింది. ఈ విషయం పౌలు యొక్క గొప్ప పోరాటాలకు ఆధారమయ్యింది. ఈ పాఠం యింకా అవసరమే. మతంలో మోషే మతాధికార స్వరాన్ని వినాలని జనులు యింకా నిలదీస్తున్నారు. అయితే, "ఈయన నా ప్రియకుమారుడు ... ఈయన మాట వినుడి" అని దేవుడు సెలవిచ్చాడు!

ఈ సందర్భంలో, సీనాయి కొండవద్ద ఇశ్రాయేలీయులవలె, ఈ ముగ్గురు అపొస్తలులు భయపడ్డారు, బోర్లపడ్డారు. ప్రభువు వారి యొద్దకు వచ్చి వారిని ముట్టాడు, వారు చుట్టూ పారచూచినప్పుడు, "యేసు తప్ప మరెవ్వరూ లేరు" (మత్తయి 17:8). మోషే ఏలీయాలు వెళ్లిపోయారు; వారు యేసు కోసం అధికారంనుండి తొలిగింపబడ్డారు.

## ముగింపు

మూడు పరిధులున్నట్టు దేవుని వాక్యం బోధిస్తుంది: భూసంబంధమైనది, మధ్యస్థ మైనది, శాశ్వతమైనది. రూపాంతరంలో బహు ఆసక్తికరమైన సంగతులలో ఒకటి ఏమంటే - ఈ మూడు పరిధులు ప్రాతినిధ్యం పొందాయి. అలాటి కూడిక ఎక్కడైనా జరిగియుంటుందా? ఆ దృశ్యాన్ని చూస్తుంటే, ఈ జీవితానంతర జీవితం మీద యింతకుముందు ఎన్నడూ లేనంతగా మనకు నమ్మకం కలుగుతుంది. ఒక దినాన మనము "ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుందుమని," ఆ ముగ్గురు

సాక్షులలో ఒకడైయున్న యోహాను తరువాత కాలంలో రాశాడు (1 యోహాను 3:2).

### "కైసరు ఇంటివారిలోని పరిశుద్ధులు"

ఫిలిప్పీ. 4:22లో కైసరు ఇంటివారిలోని పరిశుద్ధులను గూర్చి పౌలు ప్రస్తావించాడు (1:12–14 కూడా చూడు). ఆ కైసరు నీరో అయ్యుంటాడు, అతడు జూలియస్ సీసర్ ఇంటివారిలో కడపటి ఏలిక (అపో. 25–28 చూడు). అతడు తన సొంత తల్లిని, సహోదరుని, తన ఉపాధ్యాయుని, ఇంకా అనేక మంది రోమా పౌరులను చంపాడు. అతడు క్రైస్తవ్యానికి స్నేహితుడు తప్పక కాడనుకో! రోమా కాలిపోయినందుకు, తన నేరాన్ని క్రైస్తవులమీద మోపాడు. బహు క్రూరమైన హింస జరిగింది. అనేకమంది క్రైస్తవులు మేకులతో స్తంభాలకు కొట్టబడి దహించబడుతూ ఉండగా, అపహాస్యంగా నీరో వారి మధ్య స్వారి చేశాడు. ఇంత జరిగినా, కైసరు యింట పరిశుద్ధులున్నారు!

ప్రతి తరంలోనూ, తాము ఆవరింపబడియున్న క్లిష్టపరిస్థితులకు విధేయతతో నుండ నిరాకరించి, దేవుని సేవించుటలో కొనసాగారు. కొద్దిమందో లేక అసలే క్రైస్తవులు లేని క్రొత్త తావులలో విత్తనాలు నాటడానికి వెళ్లిన మిషినెరీల కథ నేడు అట్టిదే. కొన్ని సార్లు వయస్సువచ్చిన పిల్లలు తమ తల్లిదండ్రుల సమ్మతి లేకుండ సువార్తకు లోబడ తీర్మానించుకుంటారు. క్రొత్త నిబంధన క్రైస్తవులైనందుకు కొందరు యిండ్లలోనుండి తరుమబడతారు. భక్తిహీనులైన క్లాస్‌మేట్స్, జతపనివారు లేదా భర్త లేక భార్యలతో అనేకమంది ప్రభువు సంఘ సభ్యులు జీవించవలసి యుంటారు. ఏదియెలాగున్నా, కాలక్రమంలో వారు దేవునికి నమ్మకస్థులుగా నిలిచారు.

సూచనలు

[1]మార్కు 9:2–8 మరియు లూకా 9:28–36లను చూడు. [2]యాయిరు కుమార్తెను లేపినప్పుడును (మార్కు 5) మరియు గెత్సేమనేలో ప్రార్థించినప్పుడునూ (మత్తయి 26) యేసుతో కూడ పేతురు, యాకోబు, యోహానులుండిరి. [3]మరణము రుచి చూడకుండనే ఏలీయా పరలోకమునకు కొనిపోబడెను. హానోకు విషయంలో కూడా ఇది సత్యం (హెబ్రీ. 11:5).